సాక్షి
అన్నమయ్య జిల్లా

శనివారం । 6 । మే । 2023



భూసార పరీక్షలతో అధిక దిగుబడి

ఏడేళ్ల తర్వాత ప్రభుత్వం భూసార పరీక్షలకు శ్రీకారం చుట్టింది. దీంతో సాగులో అధిక దిగుబడులకు ఆస్కారం ఏర్పడింది. -IIలో..



సూర్యప్రభ వాహనంపై లక్ష్మీనరసింహుడు

వెయ్యినూతల కోనలో స్వామివారికి సూర్యప్రభ వాహన సేవ నిర్వహించారు. -IIలో..

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.68	రూ.74
రెండోరకం	రూ.50	రూ.64



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 564 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	500	500
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 71.90 కిలోలు

న్యూస్‌రీల్

21న తీర్థయాత్ర స్పెషల్ బస్సు



మదనపల్లె సిటీ: వేసవి సెలవులు పురస్కరించుకుని ఈనెల 21న తీర్థయాత్ర స్పెషల్ బస్సు నడుపుతున్నట్లు ఆర్టీసీ వన్ డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. మదనపల్లె నుంచి నందలూరు, ఒంటిమిట్ట, దేవుని కడప, బ్రహ్మంగారిమఠం, శ్రీశైలం, మహానంది, నందవరం, యాగంటి, రవ్వలకొండ, ఆహోబిలంలను సందర్శించవచ్చన్నారు. 21న ఉదయం డిపో నుంచి బయలుదేరి మరుసటి రోజు 22న మదనపల్లెకు చేరుతుందన్నారు. టిక్కెట్టు రానుపోను రూ.2000 ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు ఎం(టి) 7382875034, టీ–2, 7382876634 నంబర్లో సంప్రదించాలని కోరారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్



శిక్షణలో పాల్గొన్న క్రీడాకారులు

వాల్మీకిపురం: చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని బాస్కెట్ బాల్ అసోసియేషన్ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు చింతల శ్రీధర్ రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక పీవీసీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వేసవి శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. ప్రతి ఏడాది బాస్కెట్ బాల్ వేసవి శిబిరాన్ని సొంత నిధులతో నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసం, ఉత్సాహం లభిస్తాయన్నారు. ప్రతి రోజు ఉదయం 6 గంటల నుంచి 9గంటల వరకు, సాయంత్రం 5గంటల నుంచి 9గంటల వరకు శిక్షణ ఉంటుందన్నారు. ఇక్కడ శిక్షణ పొందిన ఎంతో మంది క్రీడాకారులు మంచి ఉద్యోగాలు సంపాధించి, ఉన్నత స్థాయిలో ఉన్నారన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కడప రూరల్ : కడప నగరం శంకరాపురంలోని ప్రభుత్వ అంధ బాలుర వసతి గృహంలో 1 నుంచి 10వ తరగతి చదవుతున్న అంధ విద్యార్థుల అడ్మిషన్లకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమశాఖ సహాయ సంచాలకులు కృష్ణ కిశోర్ ఒక ప్రకటనలో తెలిపారు. అడ్మిషన్లు పొందిన వారికి బ్రెయిలీ లిపిలో ప్రత్యేక బోధన, ప్రభుత్వ మెనూ ప్రకారం భోజనం, కాస్మోటిక్స్ చార్జీలు, నాలుగు జతల బట్టలు, ప్లేటు, గ్లాసు, ట్రంకు పెట్టె అందిచనున్నట్లు చెప్పారు. వసతి గృహంలో 100 మందికి మాత్రమే ప్రవేశం ఉంటుందన్నారు. దరఖాస్తులను వసతి గృహం వార్డెన్‌కు సమర్పించాలన్నారు. ఇతర వివరాలకు 73964 12434 నంబరులో సంప్రదించాలన్నారు.

నిలకడగా టమాటా ధర

కడప అగ్రికల్చర్: టమాటా ధర రోజుకో రకంగా ఉండేది. 20 రోజులుగా కిలో రూ. 5 నుంచి రూ.10కి ఉంది. మధ్యలో కిలో రూ. 8తో అమ్మారు.. అయితే నాలుగు రోజుల నుంచి ధర నిలకడగా ఉంది. కిలో రూ. 10 కొనసాగుతుంది. ధర దగ్గడంతో చాలా చోట్ల వ్యాపారులు ఆటోల్లో టమాటాలు విక్రయిస్తున్నారు. దీంతో వినియోగదారులు రైతుబజార్‌కు, మార్కెట్లకు వెళ్లకుండా ఆటోల వద్ద టమాటా కొనుగోలు చేస్తున్నారు.

ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్‌కు ప్రత్యేక శాఖ కావాలి



మాట్లాడుతున్న ఎమ్మార్పీస్ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య మాదిగ

కడప రూరల్: ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులకు సంబంధించి ప్రత్యేకంగా ఒక శాఖను ఏర్పాటు చేయాలని ఏపీ ఎమ్మార్పీస్ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య మాదిగ తెలిపారు. శుక్రవారం స్థానిక వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలో నాటి కాంగ్రెస్, నేటి భారతీయ జనతా పార్టీ పాలనకు సంబంధించి గడిచిన 42 ఏళ్లలో ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధుల వ్యయంపై విచారణ చేపట్టాలని అన్నారు. ఇందుకు సంబంధించి సాంఘిక సంక్షేమ శాఖకు నిధులను కేటాయించడంతో పాటు ప్రత్యేకంగా ఒక శాఖను ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వాలు మాదిగల సంక్షేమానికి ప్రత్యేకంగా చర్యలు చేపట్టాలని కోరారు. మాదిగల అభివృద్ధి, భవిష్యత్ కార్యాచరణలో భాగంగా ఈ నెల 20వ తేదీన మార్కాపురంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి సమావేశంను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర నాయకుడు పీ ఆంజనేయులు, జిల్లా నేతలు పీవీ రమణ, రామయ్య, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

పేదింటి ఆడపడుచులకు పెళ్లికానుక

- వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీతోఫా సద్వినియోగం చేసుకోవాలి
- జిల్లాలో 349 జంటలకు రూ.2.76 కోట్ల నగదు జమ
- ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ సత్యనారాయణ



లబ్ధిదారులకు మెగా చెక్కును అందజేస్తున్న ఇన్‌చార్జి జేసీ, డీఆర్‌డీఏ పీడీ తదితరులు

రాయచోటి : దేశంలో ఎక్కడా లేని విధంగా పేద కుటుంబాల్లోని చెల్లెమ్మల వివాహాలకు అండగా నిలిచేందుకు వైఎస్సాఆర్ కల్యాణమస్తు, వైఎస్సార్ షాదీతోఫా పథకాలను రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోందని ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ సత్యనారాయణ అన్నారు. శుక్రవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి వైఎస్సార్ కల్యాణమస్తు, వైఎస్సార్ షాదీతోఫా కింద జనవరి–మార్చి 2023 త్రైమాసికంలో వివాహం చేసుకున్న 12,132 మంది అర్హులైన లబ్ధిదారులకు రూ.87.32 కోట్ల ఆర్థికసాయాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బటన్‌నొక్కి నేరుగా వారి ఖాతాల్లో జమచేశారు. ఈ మేరకు అన్నమయ్య జిల్లాకు సంబంధించి 349 జంటలకు రూ.2,76,20,000 లబ్ధి చేకూరింది.

- రాయచోటి కలెక్టరేట్‌లోని స్పందన వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి ఇన్‌చార్జ్ జాయింట్ కలెక్టర్ సత్యనారాయణ, డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ, సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా అధికారి జాకీర్‌హుస్సేన్ ,లబ్ధిదారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ బాల్యవివాహాలను నివారించడం, ప్రతి చెల్లెమ్మను, తమ్ముడిని విద్యావంతులుగా తీర్చిదిద్దడం, పేద కుటుంబాల్లోని వధువుల తల్లిదండ్రులను ఆర్థికంగా ఆదుకోవాలనే సమున్నత లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ పథకాలను అమలు చేస్తోందన్నారు. ఎస్సీ, ఎస్టీ, ఈసీ, మైనార్టీలు, దివ్యాంగులు, భవన నిర్మాణ కార్మికుల కుటుంబాల్లో ని ఆడబిడ్డలకు వైఎస్సార్ కల్యాణమస్తును, మైనార్టీ ఆడబిడ్డలకు వైఎస్సార్ షాదీతోఫా కింద ప్రభుత్వం ఆర్థికసాయం అందిస్తోందన్నారు. జిల్లాలో బీసీ కులానికి చెందిన 157 మంది జంటకు రూ.8.1.40 లక్షలు, ఎస్సీలకు చెందిన 88 మందికి రూ.88.40 లక్షలు, ఎస్టీలకు చెందిన 18 మందికి రూ.18.40 లక్షలు, మైనార్టీలకు చెందిన 82 మంది జంటలకు రూ.82 లక్షలు, విభిన్న ప్రతిభావంతులకు చెందిన నలుగురికి రూ.6 లక్షలు చొప్పున ఆర్థికసాయం అందించిందన్నారు. ప్రభుత్వం ద్వారా అందిన లబ్ధిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చెందాలని ఇన్‌చార్జి జేసీ పేర్కొన్నారు. అనంతరం అన్నమయ్య జిల్లాలోని 349 జంటలకు సంబంధించి రూ.2.76,20,000 విలువైన మెగాచెక్కును ఇన్‌చార్జి జేసీ, డీఆర్‌డీఏ పీడీ, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి లబ్ధిదారులకు అందజేశారు.

మా ఇంట ఆనందానుభూతులు



వైఎస్సార్ కల్యాణమస్తు కింద ప్రభుత్వం ఆర్థికసాయం అందించినందుకు కృతజ్ఞతలు. మాది నిరుపేద కుటుంబం. ఈ సొమ్మును సద్వినియోగం చేసుకుంటాం. లంచాలకు, వివక్షతకు తావు లేకుండా.. కార్యాలయాల చుట్టూ మేము కాళ్లరిగేలా తిరిగే దుస్థితి లేకుండా.. వలంటీర్ వ్యవస్థ ద్వారా పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేసి మాలాంటి పేదోళ్ల సంక్షేమానికి ప్రభుత్వం చేస్తున్న కృషికి శతకోటి నమస్కారాలు. వైఎస్సార్ కల్యాణమస్తు ఆర్థిక లబ్ధి మా ఇంట ఆనందానుభూతులను మిగిల్చింది.

– కొప్పాల తులసి, పెంటమాలపల్లి, రాయచోటి, అన్నమయ్య జిల్లా

ముఖ్యమంత్రికి ధన్యవాదాలు



మాలాంటి పేద కుటుంబాల్లో పెళ్లి వేడుకలు, ఆర్భాటాలు చేసుకోవడం ఆర్థికంగా కష్టతరమైన విషయం. వివాహాలకు అప్పులు చేయాల్సిన పరిస్థితి. ఎక్కడా లేనివిధంగా పేద కుటుంబాల్లోని చెల్లెమ్మల పెళ్లిళ్లకు ప్రభుత్వం షాదీతోఫా అందించి ఆర్థికంగా అండగా నిలబడింది. ప్రతి చెల్లెమ్మ, తమ్ముడు విద్యావంతులుగా ఎదగాలనే లక్ష్యంతో కృషి చేస్తున్న ముఖ్యమంత్రికి నా హృదయపూర్వక ధన్యవాదాలు.

– పి.రెడ్డిప్యారీ, లక్కిరెడ్డిపల్లి, అన్నమయ్య జిల్లా

త్వరలో మల్లయ్యకొండ సందర్శిస్తా

కలెక్టర్ పీఎస్.గిరీషా



ఆర్డీఓ మురళీ, ఎస్ఈ కృష్ణారెడ్డి, అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీషా

బి.కొత్తకోట: తంబళ్లపల్లె సమీపంలోని మల్లయ్యకొండను త్వరలో సందర్శిస్తానని కలెక్టర్ పీఎస్.గిరీషా అన్నారు. శుక్రవారం ఆయన బి.కొత్తకోటలో పర్యటించారు. ఈ సందర్భంగా మదనపల్లె ఆర్డీఓ ఎంఎస్.మురళీ, డిస్కం తిరుపతి ఎస్ఈ ఎం.కృష్ణారెడ్డి, ఈఈ రాజశేఖర్‌రెడ్డి, తహసీల్దార్ ధనుంజయలుతో మాట్లాడారు. మల్లయ్యకొండపై పర్యాటక కార్యకలాపాల నిర్వహణకు అనుకూలమైన పరిస్థితులు ఉన్నట్టు టూరిజంశాఖ అధికారులు తమ దృష్టికి తీసుకొచ్చినట్లు చెప్పారు. కొండపై పర్యాటకులకు అవసరమైన వినోద కార్యక్రమాలు, ప్రకృతి అందాలను తిలకించే విధంగా ఏర్పాటు చేసేందుకు టూరిజం సాంకేతిక బృందం అధ్యయనం చేసిందన్నారు. కొండపై ఎలాంటి చర్యలు తీసుకోవాలన్న దానిపై స్వయంగా పరిశీలించడం కోసం పర్యటిస్తానని చెప్పారు. దీనికి సంబంధించి ఆలయ చైర్మన్ మల్‌రెడ్డి నుంచి వివరాలు తెలుసుకున్నారు. ప్రఖ్యాత శైవక్షేత్రంగా మల్లయ్యకొండను తీర్చిదిద్దే అవకాశం ఉందని చైర్మన్ చెప్పారు. బి.కొత్తకోట సమీపంలోని జగనన్నకాలనీ కురవానికుంటలో ఇళ్ల నిర్మాణాలపై ఆరా తీశారు. ఇక్కడ పనులు వేగవంతం చేయాల్సి ఉందని అధికారులు సూచించారు. కాగా విద్యుత్ సమస్యలు, వాటి పరిష్కారంపై ఎస్ఈ కృష్ణారెడ్డిని అడిగి తెలుసుకొన్నారు. వ్యవసాయ, గృహ వినియోగానికి సంబంధించి విద్యుత్ సరఫరా, వినియోగంపై వివరించారు.

నెలాఖరుకల్లా నాడు-నేడు పనులను పూర్తి చేయాలి

రాయచోటి: నెల మాత్రమే గడువు ఉందని, మన బడి–నాడు–నేడు పనులను వేగవంతం చేసి ఈనెల చివరికల్లా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ హాల్‌లో మనబడి, నాడు–నేడు రెండో విడత పనుల పురోగతిపై 'అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షించారు. సెలవులలో పాఠశాలలో అవసరమైన త రగతి గది, మరుగుదొడ్ల మరమ్మత్తులు పూర్తి చేయాలన్నారు.

సంక్షేమ క్యాలెండర్ ఆవిష్కరణ

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను నిర్ణీత షెడ్యూల్ ప్రకారం లబ్ధిదారులకు మంజూరు చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ గిరీషా అధికారులను ఆదేశించారు. రాష్ట్ర సమాచార పౌర సంబంధాలశాఖ రూపొందించిన జగనన్న ప్రభుత్వ సంక్షేమ క్యాలెండర్ 2023–24ను శుక్రవారం కలెక్టరేట్ ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. డీఆర్‌ఓ సత్యనారాయణ, జిల్లా సమాచార, పౌర సంబంధాల అధికారి భరత్ కుమార్ రెడ్డి, డీపీఆర్‌ఓ సీహెచ్ పురుషోత్తం, గృహ నిర్మాణశాఖ పీడీ శివయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణాలకు అడ్డుపెట్టరాదు

ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేస్తున్న రోడ్డు నిర్మాణాలకు అటవీ అధికారులు ఇబ్బందులు పెట్టవద్దని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ సూచించారు. శుక్రవారం అన్నమయ్య జిల్లా కేంద్రం, రాయచోటి కలెక్టరేట్‌లోని మినీ హాల్‌లో రాయచోటి నుంచి సానిపాయి, రాయచోటి నుంచి సుండుపల్లె డబుల్ రోడ్డు నిర్మాణం అటవీశాఖ సమీపంలో ఉందని, రోడ్డు ఫారెస్ట్ పరిధిలో ఏర్పాట్లులో భాగంగా అటవీ, రెవెన్యూ అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షించారు. ప్రజా సంక్షేమంకోసం ఏర్పాటు చేస్తున్న రోడ్డు పనులను ఇబ్బంది పెట్టవద్దన్నారు. ఇది వరకే వెళ్తున్న రోడ్డులో అటువైపు, ఇటువైపు కొంతమేర వెడల్పు చేయడం జరుగుతోందని, రోడ్లన్నీ అటవీశాఖ ఖండం రాయి లోపల మాత్రమే ఉన్నాయన్నారు. నోటిఫైలో విధంగానే రోడ్డు ఉందన్నారు. ఒకవేళ అటవీ పరిధిలో రోడ్డు ఏర్పాటు చేస్తే అందుకు తగ్గట్టుగా అటవీశాఖకు భూమి కేటాయించనున్నట్లు చెప్పారు. చిట్వేలి మండలంలో 20 ఎకరాలు ప్రభుత్వ భూమిని అటవీశాఖకు కేటాయించాలన్నారు. పొలిమేరపల్లి రోడ్డు, ఎఫ్ఎంబీ ప్రకారం రెవెన్యూ, అటవీ అధికారులు కలిపి జాయింట్ సర్వేచేసి మార్క్ చేయాలని సుండుపల్లె తహసీల్దార్‌ను ఆదేశించారు.డీఆర్‌ఓ సత్యనారాయణ, రాజంపేట డీఎఫ్ఓ వివేక్ పాల్గొన్నారు.

పగటి కలల్లో చంద్రబాబు



అంగళ్లులో మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి

మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

కురబలకోట: చంద్రబాబు సీఎం కుర్చీ కోసం పగటి కలలు కంటున్నారని, అది ఈ జన్మలో ఆయనకు అయ్యేపని కాదని రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి విమర్శించారు. అన్నమయ్య జిల్లా అంగళ్లులో శుక్రవారం ఆయన ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డితో కలసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయనకు ఘన స్వాగతం లభించింది. మంత్రి మాట్లాడుతూ గత ఎన్నికల్లో గెలిచిన చంద్రబాబు తొలి సంతకం రైతు రుణమాఫీ మీద చేస్తానని తొలి రోజే రైతులకు శఠగోపం పెట్టారన్నారు. అలాగే డ్వాక్రా రుణ మాఫీని కూడా అటకెక్కించారన్నారు. మాట తప్పిన చంద్రబాబును జన్మలో ఇక జనం నమ్మరన్నారు. ఆయనది 420 విజన్‌గా తేలిపోయిందన్నారు. 14 ఏళ్ల సీఎంగా ఉండి చంద్రబాబు ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. అంతేగాకుండా ఒంటరిగా పోటీ చేస్తే గెలవలేమని పొత్తుల కోసం ఆరాటపడుతున్నారని దుయ్యబట్టారు. సీఎం జగన్ పాలనలో అర్హులందరికీ లబ్ధి చేకూరిందన్నారు. ప్రతి ఇంటికి రూ. 2 లక్షల నుంచి రూ. 7 లక్షలకు పైగా వివిధ పథకాల ద్వారా లబ్ధి చేకూరిందన్నారు. ఇన్ని సంక్షేమ పథకాలు తాను ఏ ప్రభుత్వంలో చూడలేదన్నారు. చరిత్రలో ఎవ్వరూ చేయని విధంగా అన్ని వర్గాలకు న్యాయం చేస్తున్న జననేతగా జగన్ ప్రజల మనసుల్లో చిరస్థాయిగా నిలచిపోతారన్నారు. మరోసారి జగన్ సీఎం కావడం ఖాయమని మంత్రి పెద్దిరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయాన్ని ఎవ్వరూ ఆపలేరని స్పష్టం చేశారు. జెడ్పీటీసీ బైసాని జ్యోతి, ఎంపీపీ బి. దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

కుటుంబానికి ఆసరాగా నిలవాలి

కడప సెవెన్‌రోడ్స్ : విధి నిర్వహణలో పలు కారణాలతో మృతి చెందిన కుటుంబాలకు సంబంధించిన నలుగురికి శుక్రవారం జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి కారుణ్య నియామక పత్రాలను అందజేశారు. వీరిలో ఎస్.సుష్మకు వైఎస్సార్ జిల్లా మద్దనూరు మండలం కొర్రపాడు గ్రామంలోని జెడ్పీ హైస్కూలులో జూనియర్ అసిస్టెంట్‌గా నియామక పత్రం ఇచ్చారు. రామాపురం మండల ఎంపీపీ కార్యాలయ సబార్డినేట్‌గా కె.రెడ్డెమ్మకు కారుణ్య నియామకం కింద ఉద్యోగాలు ఇచ్చారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ కారుణ్య నియామకాలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఉద్యోగంతో తమ కుటుంబాలకు ఆసరాగా నిలువాలని సూచించారు. జిల్లా పరిషత్ చైర్మన్‌గా ఆకేపాటి బాధ్యతలు చేపట్టిన తర్వాత కారుణ్య నియామకాలకు ప్రాధాన్యత ఇచ్చారు. 2021 సెప్టెంబరు నుంచి నేటి వరకు 59 మందికి పంచాయతీరాజ్ శాఖలో ఉద్యోగాలు ఇచ్చారు.



కారుణ్య నియామకాలు పొందిన వారితో జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి

నందబాలుడి ఆనంద విహారం



తెప్పపై ఉన్న స్వామి, అమ్మవార్లను దర్శించుకుంటున్న భక్తులు

కడప కల్చరల్ : దేవునికడప శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయ తెప్పోత్సవాలు శుక్రవారం ముగిశాయి. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లు తెప్పపై విహరించారు. ఆలయం అర్చకులు తొలుత ఆలయ ప్రాంగణంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తులకు తిరుమంజన అభిషేకం నిర్వహించారు. అనంతరం పల్లకీపై స్వామికి సమీప వీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. తమ ఇళ్ల వద్దకు తరలివచ్చిన దేవతామూర్తులను దర్శించుకుని భక్తులు పూజా ద్రవ్యాలు సమర్పించి మొక్కుకున్నారు. అనంతరం మంగళవాయిద్యాల మధ్య ఊరేగింపుగా పుష్కరిణి వద్దకు ఉత్సవ మూర్తులను తీసుకొచ్చి అలంకరించి పూజలు చేసి తెప్పపై కొలువుదీర్చారు. మూడుమార్లు వేద పండితుల మంత్రోచ్చాటనలు, రెండుసార్లు మంగళ వాయిద్యాల సుస్వరాలు, మరో రెండుసార్లు అన్నమాచార్య కీర్తనల మధ్య తెప్పోత్సవం నిర్వహించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు త్రివిక్రమ్ బృందం పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.



విశేష అలంకారంలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వరుడు

ఆర్టీసీ టెంపుల్ టూరిజం

- ఆదాయం పెంపు కోసం కొత్త మార్గాల అన్వేషణ
- పౌర్ణమికి అరుణాచలయాత్ర
- కాణిపాకం, శ్రీపురం, కంచి తదితర పుణ్యక్షేత్రాల దర్శనం



మదనపల్లి ఆర్టీసీ డిపోలో అరుణాచలం వెళ్తున్న బస్సులను జెండా ఊపి ప్రారంభిస్తున్న ఆర్ఎం రాము (ఫైల్)

రాయచోటి : ఆదాయం పెంపు కోసం ఆర్టీసీ కొత్త మార్గాల అన్వేషణ సత్ఫలితాల దిశగా సాగుతోంది. సాధారణంగా ఆర్టీసీ ప్రయాణీకుల ద్వారా వచ్చే రాబడి కంటే దానికయ్యే ఖర్చే అధికంగా ఉంటోంది. అయినప్పటికీ సేవా దృక్పథంతో ప్రజల కోసం బస్సులను నడుపుతోంది. నష్టాన్ని అధిగమించి సంస్థను పటిష్టం చేయాలన్న దృక్పథంతో పాటు ప్రజలకు తక్కువ ఖర్చుతో తీర్థయాత్రలు, విజ్ఞానకేంద్రాలు, సందర్శన ప్రాంతాలకు బస్సులను నడిపేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. దీంతో ఇతర ఆదాయమార్గాలపై దృష్టి సారిస్తోంది. ఇప్పటికే లాజిస్టిక్స్ ద్వారా ఆశించిన స్థాయిలో ఆదాయం సమకూరుతోంది. కొత్తగా కార్గోలో డోర్ డెలివరీ,పికప్ సదుపాయాలను కూడా ప్రవేశపెట్టింది. వీటికి వినియోగదారుల నుంచి ఆదరణ బాగుంది. ఈ నేపథ్యంలో సరికొత్తగా ఆలయాలు, విజ్ఞాన కేంద్రాల టూరిజంపై దృష్టి సారించింది. ఇందులో భాగంగా అన్నమయ్య జిల్లా నుంచి పొరుగున ఉన్న తమిళనాడులోని అరుణాచలం, మున్నార్,రామేశ్వరం, ఊటీ, తెలంగాణలోని భద్రాచలం, రాష్ట్రంలోని విజయవాడ కనకదుర్గమ్మ, కోటప్పకొండ, అన్నవరం, సింహాచలం తదితర పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సులను నడుపుతోంది. ఇప్పటికే జిల్లా నుంచి అరుణాచలానికి ప్రతి పౌర్ణమికి ఏడు ఆర్టీసీ బస్సులను తిప్పుతున్నారు. తక్కువ ఖర్చుతో పాటు అనుకూలమైన రవాణా అందుబాటులోకి వచ్చింది. దీంతో ప్రతి పౌర్ణమికి అరుణాచలగిరి ప్రదక్షిణకు భక్తులు పోటెత్తుతుంటారు. దీనిని దృష్టిలో ఉంచుకొని జిల్లా (మదనపల్లె బస్‌స్టేషన్) నుంచి అరుణాచలానికి ప్రతి పౌర్ణమికి ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు. శుక్రవారం నాటి పౌర్ణమికి 3వ తేదీ నుంచే ఇక్కడ నుంచి ఈ బస్సులు బయలుదేరేలా ప్రణాళిక రూపొందించామన్నారు. అరుణాచలం వెళ్లేటప్పుడే కాణిపాకం, శ్రీపురం, కంచి, శ్రీకాళహస్తి దేవాలయాలను కూడా దర్శించుకునే అవకాశం కల్పిస్తామని చెప్పారు. పౌర్ణమి దర్శనం అయ్యాక తిరిగి వారి ప్రాంతాలకు చేరుస్తామని తెలియజేస్తున్నారు.

విశేషంగా ప్రచారం

ఆర్టీసీ ఆధ్వర్యంలో చేపట్టిన తీర్థయాత్రలు విజ్ఞానకేంద్రాల సందర్శన పర్యటనకు సంస్థ అధికారులు విశేషంగా ప్రచారాన్ని చేపట్టారు. టీవీల ద్వారానే కాకుండా సోషల్ మీడియా,కరపత్రాలు, పోస్టర్లు, బ్యానర్ల ద్వారా చేస్తున్న ప్రచారానికి ప్రజల నుంచి బాగా మద్దతు లభిస్తుంది.

ప్రాంతాల వారీగా ప్యాకేజీ ధరలు



సూపర్ లగ్జరీ, అల్ట్రా డీలక్స్ సర్వీసులను ప్రాంతాలకు అనుగుణంగా బస్సులను నడుపుతున్నాం. దూరం, దర్శన ప్రాంతాలను పరిగణనలోకితీసుకుని ధరలను నిర్ణయిస్తాం. రూ.1800 నుంచి రూ.6 వేల వరకు ప్యాకేజీ ధరలను ప్రస్తుతం నిర్ణయించాం. జిల్లాలోని 5 డిపోల నుంచి యాత్రల బస్సులు నడుస్తాయి. మదనపల్లె–1,2, రాయచోటి, పీలేరు, రాజంపేట డిపోల నుంచి బస్సులు తిరుగుతుంటాయి. ఈ యాత్రలకు ఆన్‌లైన్‌లో టిక్కెట్లు బుక్ చేసుకునే వీలు కల్పించాం. మరోవైపు పొరుగున ఉన్న తమిళనాడు, కర్ణాటక, కేరళ, తెలంగాణ ప్రాంతాల్లో ని ప్రముఖ పుణ్యక్షేత్రాలకు కూడా స్పెషల్ ప్యాకేజీతో బస్సులను నడపాలని నిర్ణయించుకున్నాం.

–పి. రాము, ఆర్టీసీ ఆర్ఎం, అన్నమయ్య జిల్లా

పేదల ఆరోగ్యపరిరక్షణకే 'ఫ్యామిలీ డాక్టర్'



వైద్యులకు సూచనలిస్తున్న డీఎంహెచ్ఓ కొండయ్య

రాయచోటి అర్బన్: గ్రామీణ ప్రాంతంలోని పేదల ఆరోగ్యపరిరక్షణకే ప్రభుత్వం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ప్రారంభించిందని డీఎంహెచ్ఓ డాక్టర్ కొండయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని కాటిమాయకుంట గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహణను ఆయన ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రతి పౌరుడికి ఆరోగ్యశాఖ ద్వారా ఒక ఐడీ నంబరును కేటాయిస్తున్నామన్నారు. ఈ నంబరును ఆధార్‌తో లింక్ చేయనున్నట్లు చెప్పారు. దేశంలో ఎక్కడైనా మన హెల్త్‌కార్డులో డాటాను చెక్ చేసుకోవచ్చన్నారు.ఫ్యామిలీ డాక్టర్ యాప్‌లో కుటుంబాల వారీగా వివరాలను అప్‌డేట్ చేయనున్నట్లు చెప్పారు. 105 రకాల మందులు, 14 రకాల పరీక్షలు, గుండెకు సంబంధించిన ఈసీజీ పరీక్షలు కూడా అందుబాటులో ఉంచారన్నారు. కార్యక్రమంలో మలేరియా అధికారి వేణుగోపాల్, యండపల్లె పీహెచ్‌సీ వైద్యురాలు దివ్యవాణి, హెల్త్ ఎడ్యుకేటర్ బలరామరాజు, సీహెచ్ఓ ఉషారాణి, ఏఎన్‌యం చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పాము కాటుతో ఇద్దరికి అస్వస్థత

మదనపల్లె : పాముకాటుకు గురై ఇద్దరు తీవ్ర అస్వస్థత పాలైన సంఘటన శుక్రవారం మొలకల చెరువు, పీటీఎం మండలంలో జరిగాయి. వివరాలు... మొలకలచెరువు మండలం బురకాయల కోట సెంట్రల్ స్కూల్ ఏరియాకు చెందిన శాంతమ్మ (50) కూలీ పనులు చేస్తూ జీవిస్తోంది. ఈ క్రమంలో శుక్రవారం బాత్‌రూంలో ఉన్న నీటి డ్రమ్ములను శుభ్రం చేస్తుండగా అందులో దూరిన ఓ పాము కాటు వేసింది. అదే విధంగా పీటీఎం మండలం సీవీ పల్లెకు చెందిన శ్రీరాములు (52) వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నాడు. గురువారం రాత్రి ఇంటి వద్ద నడిచి వెళుతుండగా దారిలో ఓ విష సర్పం కాటు వేసింది. దీంతో బాధితులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. గమనించిన స్థానికులు వారిని 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. చికిత్సల అనంతరం కోలుకుంటున్నారు.

పరిహారం కోసం నిరసన

ఓబులవారిపల్లె : నూతన జాతీయ రహదారి భూసేకరణలో బలిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన రైతులకు పూర్తి పరిహారం ఇప్పించాలని శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సేకరించిన భూమిలో కొంత భూమికే పరిహారం ఇస్తున్నారని తెలిపారు. అలాగే పొలంలోని బోర్లు, చెట్లకు ఇవ్వడం లేదని పేర్కొన్నారు. ఈ విషయంపై ఇటీవల జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశామని తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు భూములు పరిశీలించి సర్వే నిర్వహించారని పేర్కొన్నారు. అయితే ఇప్పటి వరకు పరిహారం ఇవ్వలేదని, వెంటనే ఇప్పించాలని కోరారు. ఈ విషయంపై తహసీల్దార్ పీర్ మున్ని వివరణ కోరగా.. రైతులకు సంబంధించిన నివేదికలను ఉన్నతాధికారులకు పంపించామని తెలిపారు.

చెరువులో గుర్తుతెలియని మృతదేహం

ఒంటిమిట్ట : ఒంటిమిట్టలోని చెరువులో శుక్రవారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు స్థానిక పోలీసులు తెలిపారు. పోలీసుల తెలిపిన వివరాల మేరకు... ఒంటిమిట్ట చెరువులో చిన్న అలుగు వద్ద శుక్రవారం గుర్తుతెలియని మృతదేహం తేలియాడుతుండటం చూసిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి వారు చేరుకుని, మృతదేహాన్ని బయటికి తీశారు. పోస్టుమార్టం నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. ఎస్‌ఐ మధుసూదన్‌రావు కేసు నమోదు చేశారు.

భూసార పరీక్షలతో అధిక దిగుబడి

- ఏడేళ్ల తరువాత ప్రారంభమైన ప్రక్రియ
- రెండు నెలల పాటు కొనసాగనున్న కార్యక్రమం
- భూమిలో సమతుల్యత సాధించడమే లక్ష్యం



పొలంలో భూసార పరీక్షల నిమిత్తం మట్టి నమూనాలను సేకరిస్తున్న వ్యవసాయ అధికారులు

గుర్రంకొండ : ఏడేళ్ల తరువాత ప్రభుత్వం భూసార పరీక్షలకు శ్రీకారం చుట్టింది. తద్వారా పంటల సాగులో అధిక దిగుబడులు సాధించే అవకాశం ఏర్పడుతుంది. ప్రస్తుతం ఆర్బీకేల ద్వారా మట్టిసేకరణ పనులు ప్రారంభమయ్యాయి. నీటి సౌకర్యం అనగా బోర్లు, బావులు, సాగునీటి కాలువల ద్వారా ఏడాది పొడవునా నీటిసౌకర్యం ఉన్న పొలాల్లో ఏడాదికొకమారు భూసార పరీక్షలు చేయించాలి. ప్రతి మూడు సీజన్‌లకొకమారు భూసార పరీక్షలు చేయించుకోవడం వల్ల రైతుకు మంచి ఫలితాలు వచ్చే అవకాశముంది. వర్షాధార పంటల సాగు భూముల్లో అనగా కేవలం ఏడాది పొడవునా కురిసే వర్షాలపై ఆధారపడి పంటలు సాగు చేసే మెట్ట భూముల్లో మూడేళ్ల కొకమారు భసార పరీక్షలు చేయించుకోవాల్సి ఉంటుంది. రైతులు పంటలు సాగు చేసిన ప్రతి సారి భూమిలో నత్రజని, భాస్వరం వినియోగం ఎక్కువగా ఉంటుంది. భూసార పరీక్షలో భూమిలో ఎంత మేరకు వీటి శాతం తగ్గిందో తెలుసుకోవచ్చు. తద్వారా పంట సాగు చేసే ముందు పొలంలో తగినంత మేరకు వీటిని పిచికారీ చేస్తే భూసారం మళ్లీ యథాస్థితికి చేరుకొని అధిక దిగుబడులు సాధించవచ్చు. భూసార పరీక్షలు చేయించుకోవడం వల్ల పొలం గుల్ల బారిపోకుండా జాగ్రత్త పడవచ్చు.

ఏప్రిల్, మే నెలలు అనుకూలం

భూసార పరీక్షల కోసం పొలాల్లో గానీ, భూమిలో గానీ మట్టి నమూనాలను సేకరించేందుకు ఏప్రిల్, మే నెలలు అనుకూలంగా ఉంటాయి. ఏడాదిలో ఈ రెండు నెలల్లో చాలా వరకు పొలాల్లో పంటలు సాగు ఉండదు. దీంతో బీడు భూములు అధికంగా ఉంటాయి. అప్పుడు మట్టినమూనాలు సేకరిస్తే కచ్చితమైన ఫలితాలు వస్తాయనేది వ్యవయసాయాధికారుల నమ్మకం. బీడుభూములపై ఉన్న పిచ్చిమొక్కలను, గడ్డిని తొలగించి అక్కడ మట్టి నమూనాలను సేకరిస్తారు.

ఎనిమిది చోట్ల మట్టి సేకరణ

భూసార పరిక్షల్లో భాగంగా ఒక పొలంలో ఎనిమిది చోట్ల మట్టినమునాలను సేకరిస్తారు. అవి వర్షాధార భూములైనా సరే, నీటి సౌకర్యం ఉన్న పొలాలైనా సరే ఒకే మట్టిసేకరణ విధానం ఒకేలా ఉంటుంది. పొలం నలుమూలల ఎనిమిది చోట్ల వీ ఆకారంలో తవ్వి ఒక చోట అరకిలో చొప్పున మట్టి నమూనాలను సేకరిస్తారు. తరువాత మట్టిమొత్తాన్ని ఒకే చోట కలిపి భూసార పరీక్షలు చేస్తారు. తద్వారా పొలంలో పోషకాలు ఎంతమేరకు ఉన్నాయో తెలిసే అవకాశముంటుంది.

21 రోజుల్లో ఫలితం

సేకరించిన మట్టి నమూనాలను వ్యవసాయశాఖ ల్యాబ్‌కు తీసుకెళ్లి పరీక్షలు నిర్వహిస్తారు. వీటి ఫలితాలను 21 రోజుల తరువాత ప్రకటిస్తారు. ఆర్బీకే సిబ్బంది భూసార పరీక్షల ఫలితాన్ని సదరు పొలం రైతుకు తెలియజేస్తారు. తద్వారా సదరు పొలంలో నత్రజని, పొటాష్, భాస్వరం, కాల్షియం, ఐరన్ తోపాటు ఉదకజనిక సూచిక, సేంద్రీయకర్బనం వంటివి ఎంత మేరకు ప్రస్తుతం భూమిలో ఉన్నాయో ఫలితాలు సూచిస్తాయి. దీంతో పొలంలో భుసారాన్ని పెంపొందించేందుకు ఎలాంటి పోషక విలువలు కలిగిన ఎరువులు వాడాలో సూచిస్తారు.

స్థూల, సూక్ష్మపోషకాల సమతుల్యత

పంటలు సాగు చేసే పొలాలు, చేలల్లో స్థూల, సూక్ష్మ పోషకాల సమతుల్యత భూసార పరీక్ష ద్వారా సరి చేసుకోవాల్సి ఉంటుంది. పొలాలను దక్కులు చేసే, విత్తనాలు వేసే సమయంలో సూక్ష్మ పోషకాల మందులను వినియోగించాల్సి ఉంటుంది.

ముమ్మరంగా కార్యక్రమం

ప్రభుత్వ ఆదేశాలు అనుసారం ఏప్రిల్, మే నెలల్లో భూసార పరీక్షలు నిర్వహించే కార్యక్రమాన్ని అధికారులు, సిబ్బంది ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. జిల్లాలోని ప్రతి గ్రామంలో ఉన్న ఆర్బీకే పరిధిలో మొదటి విడతగా ఇద్దరు రైతుల పొలాల్లో మట్టి నమూనాలను సేకరించి ఫలితాలు చెప్పనున్నారు.

రెండు రెట్లు అధిక దిగుబడి

భూసార పరీక్షలు నిర్వహించి ఫలితాలు తెలుసుకోవడం వల్ల పంటల సాగులో ఉత్తమ ఫలితాలు సాధించవచ్చు. భూమిలో గానీ, పొలంలో గానీ ఉన్న లోపాలను భూసార పరీక్ష ఫలితాల్లో తెలిసిపోతుంది. వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలు పాటిస్తే అప్పటి వరకు సదరు పొలంలో సాగు చేసే పంటల దిగుబడి కన్నా రెండు రెట్లు అధికంగా దిగుబడులను రైతులు సాధించే అవకాశంశ ఉంటుంది.

ప్రభుత్వం మంచి పని చేస్తోంది



ప్రస్తుతం భూసార పరీక్షలు చేయాలన్న నిర్ణయం తీసుకొని ప్రభుత్వం మంచి పని చేస్తోంది. చాలా ఏళ్ల తరువాత ఇలాంటి కార్యక్రమం మొదలు పెడుతున్నారు. ఈ కార్యక్రమంలో రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. భూములు, పొలాల్లోని లోటుపాట్లు తెలుసుకొని సరి చేసుకొనే అవకాశాన్ని రైతులకు ప్రభుత్వం కల్పించడం హర్షణీయం.
– నాగప్ప, రైతు, మొరంపల్లె

మట్టినమూనాలు సేకరిస్తున్నారు



ఇప్పటికే గ్రామాల్లో ఆర్బీకే సిబ్బంది పొలాల్లో మట్టినమూనాలు సేకరిస్తున్నారు. 21 రోజుల తరువాత భూసార పరీక్షల ఫలితాలు రైతులకు తెలియజేస్తాం. సదరు రైతు పొలంలో ఉన్న లోపాలను తెలియజేసి లోపాలు సరిచేసుకొనే సూచనలు, సలహాలు వారికి ఇస్తాం. ఇవి రైతులకు ఎంతగానో ఉపయోగపడతాయి.
– రత్నమ్మ, ఏవో, గుర్రంకొండ

భూములు సారవంతం చేసుకోవచ్చు



భూసార పరీక్షలతో పొలాలు, భూములు సారవంతం చేసుకోవచ్చు. చాలా ఏళ్లుగా భూసార పరిక్షలు నిర్వహించే కార్యక్రమం జరగలేదు. ప్రస్తుతం తిరిగి ప్రారంభం కావడంతో రైతులకు ఉపయోగకరం. గుల్లబారిపోయిన భూములు భూసార పరీక్షలతో సారవంతంగా మారుతాయి. తద్వారా అధిక పంట దిగుబడులు సాధించవచ్చు.
– వాణిశ్రీ, ఏడీఏ, వాల్మీకిపురం

కౌలు రైతు ఆత్మహత్య



బి.విశ్వనాథరెడ్డి (ఫైల్)

ములకలచెరువు : అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం మేరకు.. ములకలచెరువు మండలం పర్తికోట గ్రామం ఆవులవారిపల్లెకు చెందిన బి.విశ్వనాథరెడ్డి(40) జీవనోపాధి కోసం బొలేరో వాహనాన్ని ఫైనాన్స్ కింద కొన్నాడు. ఇందుకు రూ.8 లక్షల అప్పు చేశాడు. ఆశించిన స్థాయిలో బాడుగలు రాక వాహనంపై తీసుకున్న ఫైనాన్స్ కట్టలేకపోయాడు. ఫైనాన్స్ కంపెనీ వారు వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. తర్వాత స్వగ్రామంలో రెండు ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకున్నాడు. టమాట సాగు చేశాడు. వాటికి కూడా ధరలు లేక రూ.4 లక్షల అప్పు మిగిలింది. దీనికి తోడు మరో వైపు పిల్లల చదువులు భారం కావడం.. చేసిన అప్పులు ఎలా తీర్చాలో దిక్కుతోచక మనస్తాపానికి గురయ్యాడు. టమాట పంట వద్దనే గురువారం పురుగుల నివారణ మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. కుటుంబ సభ్యులు వెంటనే మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో తిరుపతి రుయాకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు.

21 నుంచి జమ్మలమడుగు ఉరుసు

జమ్మలమడుగు : జమ్మలమడుగులో ఈ నెల 21వ తేది నుంచి జూన్ 4 వరకు ఉరుసు మహోత్సవాలు నిర్వహించనున్నారు. పట్టణంలోని పలగాడి వీధికి చెందిన కామిలే షరియత్ పీరే తరీఖత్ అల్లామ మౌలివ్వ హాఫిజ్ తూగుట్లపల్లి జాగిర్‌ధార్ హజరత్ సయ్యద్ షా బడేగౌస్‌పీరా ఖాద్రీ 91వ ఉరుసు మహోత్సవ పోస్టర్లను ఆస్థానయే గౌసియా పీఠాధిపతి, ప్రభుత్వ గెజిటెడ్ ఖాజీ సయ్యద్‌షా గౌస్‌పీరాఖాద్రీ శుక్రవారంఆవిష్కరించారు. ఈ సందర్భంగా పీఠాధిపతి మాట్లాడుతూ ఈ ఏడాది ప్రతి ఏడాది జరిగే కార్యక్రమాలకు భిన్నంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. 21న ఆదివారం సాయంత్రం జెండావిష్కరణ కార్యక్రమంతో ఉరుసు ప్రారంభించడం జరుగుతుందన్నారు.

తేనెటీగల దాడిలో ఏడుగురికి తీవ్ర గాయాలు



గాయపడిన భారతమ్మ

మదనపల్లె : తేనెటీగల దాడిలో ఒకే కుటుంబానికి చెందిన ఏడుగురు తీవ్రంగా గాయపడిన సంఘటన శుక్రవారం మదనపల్లె మండలంలో జరిగింది. వేంపల్లె గ్రామానికి చెందిన కృష్ణకాంత్ కుటుంబ సభ్యులు జంగాలపల్లె రోడ్డులోని అక్కదేవతల గుడిలో పూజ చేస్తున్నారు. పక్కనే కట్టెల పొయ్యి వెలిగించి ప్రసాదం తయారు చేసే క్రమంలో తేనె తెట్టుకు పొగ తగలడంతో తేనెటీగలు ఒక్కసారిగా జనాలపై దాడి చేశాయి. ఇందులో కృష్ణకాంత్ (34), అతని కుటుంబ సభ్యులు మాధురి (27), గీతాంజలి (17), భారతమ్మ (52), సూర్యప్రకాష్ (15), జాగృతి (7), హేత్వీ (3)లు తీవ్రంగా గాయపడ్డారు. మరి కొందరు తప్పించుకుని పరుగులు తీశారు. గమనించిన కుటుంబ సభ్యులు బాధితుల్ని 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు వారికి మెరుగైన చికిత్సలు అందించారు. వీరిలో మాధురి, గీతాంజలి పరిస్థితి విషమంగా మారడంతో ఆసుపత్రిలోని ఐసీయూ విభాగానికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

నిర్వాసితులకు 15 ఎకరాల్లో ఇళ్ల స్థలాలు



అమరనారాయణపురంలో భూమిని పరిశీలిస్తున్న ఆర్డీఓ మురళీ

బి.కొత్తకోట : కురబలకోట మండలం పిచ్చలవాండ్లపల్లె సమీపంలో నిర్మిస్తున్న సాగునీటి ప్రాజెక్టు నిర్వాసితులకు బి.కొత్తకోట మండలంలోని అమరనారాయణపురంలో ఇళ్లస్థలాలు కేటాయించనున్నామని మదనపల్లె ఆర్డీఓ ఎంఎస్.మురళీ చెప్పారు. శుక్రవారం ఆయన అమరనారాయణపురంలో స్థలాలు కేటాయించనున్న భూములను తహసీల్దార్ ధనుంజయలుతో కలిసి పరిశీలించారు. కోటావూరు పంచాయతీలోని దిన్నిమీదపల్లె, చౌటకుంటపల్లెకు చెందిన 125 మంది నిర్వాసితులకు స్థలాలు ఇవ్వనున్న చోట గుట్ట, బండలు ఉండటం పరిశీలించారు. పేదలకు కేటాయించిన 13 ఎకరాల డీకేటీ భూమి, మూడు ఎకరాల ప్రభుత్వ భూమిని సేకరించి సిద్ధం చేయాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. డీకేటీ భూములకు పరిహారం చెల్లించేందుకు నివేదికలు సిద్ధం చేయాలన్నారు. తర్వాత పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై పర్యటించారు. పోలీసు అతిథి గృహం పక్కన ఉన్న రెవెన్యూ భూమిని పరిశీలించి ఇక్కడ పర్యాటకుల సౌకర్యం కోసం నిర్మాణాలు చేపట్టడంపై సమీక్షించారు. నిర్మాణంలోని రెవెన్యూ అతిథి భవనాన్ని పరిశీలించారు. కొండపై మళ్లీ ప్రారంభించిన డిస్పెన్సరీని తనిఖీ చేశారు. విధుల్లోని స్టాఫ్‌నర్సు స్వాతి పర్యాటకులు, స్థానికులకు అందిస్తున్న వైద్యసేవలను వివరించారు. దీనిపై ఆర్డీఓ మాట్లాడుతూ కొండపై డిస్పెన్సరీ ప్రారంభం కోసం ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి కృషి చేశారని చెప్పారు. కొండకు వచ్చే సందర్శకులకు ఏదైనా ప్రమాదం లేక ఆరోగ్య సమస్యలు తలెత్తితే తక్షణం వైద్యం అందించాలన్న లక్ష్యంతో డిస్పెన్సరీని కొనసాగిస్తున్నట్టు చెప్పారు. సందర్శకులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని కోరారు. ఔషధాలను పరిశీలించారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ బాలాజీ, సర్వేయర్ శ్రీవాణీ, వీఆర్‌ఓ ఖాదర్‌బాషా, సిబ్బంది పాల్గొన్నారు.

బౌద్ధారామాల సందర్శన



అడపూర్ గుట్టపై దుండగులు ధ్వంసం చేసిన బౌద్ధారామాన్ని పరిశీలిస్తున్న ఇంటాక్ సభ్యులు

నందలూరు (రాజంపేట)/కడప కల్చరల్ : రాయలసీమలో తొలిసారిగా బయల్పడిన బౌద్ధారామాల వద్ద శుక్రవారం గౌతమ బుద్ధుడి జయంతిని ఘనంగా నిర్వహించారు. బుద్ధిస్ట్ కల్చరల్ సొసైటీ ఇంటాక్ చాప్టర్, లయన్స్‌క్లబ్, రాయలసీమ టూరిజం, యోగివేమన యూనివర్సిటీ, ఆర్కియాలజి డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో వేడుకలు జరిపారు. అనంతరం భారత జాతీయ కళా వారసత్వ పరిరక్షణ సంస్థ (ఇంటాక్) సభ్యులు గుట్టపై గల గుహలను పరిశీలించారు. పైనుంచి రెండవ ఆరామం గుప్త నిధుల కోసం తవ్వేసి ఉండటాన్ని గమనించి ఆందోళన వ్యక్తం చేశారు. అప్పటికే అక్కడికొచ్చిన కేంద్ర పురావస్తుశాఖ కన్జర్వేటర్ బాలకృష్ణ, స్వరూప్ దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి భవిష్యత్తులో ఇలా జరగకుండా శాశ్వతంగా కంచె ఏర్పాటు చేయాలని ఇంటాక్ సభ్యులు కోరారు. కార్యక్రమంలో ఇంటాక్ సంస్థ పూర్వ కన్వీనర్ ఎలియాస్‌రెడ్డి, ప్రస్తుత ఇంటాక్ కన్వీనర్ చిన్నపరెడ్డి, సభ్యులు కొండారెడ్డి, జోజిరెడ్డి, సంజీవరెడ్డి, బుద్ధుని కల్చరల్ సొసైటీ అధ్యక్షుడు పిల్ల కుమారస్వామి, సెక్రటరీ ప్రసాద్, ఉపాధ్యక్షులు డాక్టర్ అశోక్‌కుమార్, డాక్టర్ రాజేశ్వరమ్మ, జాయింట్ సెక్రటరీ శివారెడ్డి, రిటైర్డ్ ప్రిన్సిపాల్ జ్యోజిరెడ్డి, ఆడపూరు ఆశ్రమ నిర్వాహకులు రవీంద్రరాజు, ఏబీటీఎస్ విద్యార్థులు, ఆడపూరు, నందలూరు గ్రామప్రజలు పాల్గొన్నారు.

సీఎం కప్‌లో వైఎస్సార్ జిల్లా క్రీడాకారుల హవా



విజేతగా నిలిచిన ఫుట్‌బాల్ బాలికల జట్టు

కడప స్పోర్ట్స్ : తిరుపతి నగరంలో నిర్వహించిన ఏపీ సీఎం కప్ క్రీడాపోటీల్లో వైఎస్సార్ జిల్లా క్రీడాకారులు సత్తా చాటారు. టీమ్, వ్యక్తిగత విభాగాల్లో పతకాల పంట పండించారు. ఫుట్‌బాల్ బాలికల విభాగంలో స్టేట్ చాంపియన్‌గా నిలిచారు. అలాగే హ్యాండ్‌బాల్ బాలుర విభాగంలో రన్నరప్‌గా, హాకీ బాలుర విభాగంలో మూడవస్థానంలో నిలిచారు. బ్యాడ్మింటన్ బాలుర విభాగంలో రెండవ, బాలికల విభాగంలో మూడవ స్థానంలో నిలిచారు. టెన్నిస్ క్రీడాంశంలో బాలికలు రెండవ స్థానం, బాలురు మూడవ స్థానం పొందారు. దీంతోపాటు వెయిట్‌లిఫ్టింగ్ పురుషుల విభాగంలో ఒక స్వర్ణం, రెండు రజత పతకాలు, మహిళ విభాగంలో ఒక రజత పతకం సాధించారు. టెన్నిస్ మహిళల విభాగంలో రజతం, బాక్సింగ్ మహిళల విభాగంలో రజతం, పురుషుల విభాగంలో కాంస్యపతకం కైవసం చేసుకున్నారు. జిల్లా క్రీడాకారుల ప్రతిభ పట్ల స్టెప్ సీఈఓ సాయి గ్రేస్, డీఎస్‌ఏ చీఫ్ కోచ్ అమృతరాజ్ హర్షం వ్యక్తం చేశారు.

ఇరువర్గాల మధ్య ఘర్షణ

కాశినాయన : మండలంలోని గంగనపల్లె గ్రామంలో శుక్రవారం ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఇరువర్గాలు ఆర్థిక లావాదేవీలపై మాటకుమాట పెరిగి ఘర్షణ పడ్డారని, ఇద్దరికి గాయాలయ్యాయని ఎస్‌ఐ హరిప్రసాద్ తెలిపారు. ఒక వర్గంలోని ఏడుగురిపై, మరో వర్గంలోని 8 మందిపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కుందూలో జారి పడి వృద్ధుడి మృతి

రాజుపాళెం : మండల పరిధి వెల్లాల గ్రామ సమీపంలోని కుందూనదిలో కాలకృత్యాలకు వెళ్లిన వృద్ధుడు జారి పడి మృతి చెందిన సంఘటన శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. ప్రొద్దుటూరులోని శాస్త్రినగర్‌కు చెందిన బండ గుర్రప్ప (61) అనే వృద్ధుడు తమ కుటుంబ సభ్యులతో కలిసి వెల్లాలలోని ఆలయాలకు వచ్చారు. ఈ క్రమంలో గుర్రప్ప కాలకృత్యాలు తీర్చుకునేందుకు సమీపంలోని కుందూనది వద్దకు వెళ్లాడు. ఈ సమయంలో ప్రమాదవశాత్తు జారి నీటిలో పడిపోయాడు. కొద్ది సేపటికి గుర్రప్ప శవమై తేలినట్లు అక్కడున్న వారు చెప్పారు. విషయం తెలుసుకున్న భార్య, కుమారులు బోరున విలపించారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. ఈ మేరకు రాజుపాళెం ఎస్‌ఐ రాజగోపాల్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరు జిల్లా ఆసుపత్రికి తరలించారు.

రూ.240 కోట్లతో ఉచితంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు

తిరుపతి డిస్కం ఎస్‌ఈ కృష్ణారెడ్డి



వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పరిశీలిస్తున్న ఎస్‌ఈ కృష్ణారెడ్డి

బి.కొత్తకోట : గతేడాది నవంబర్ నుంచి ఇప్పటి వరకు ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన వ్యవసాయ రైతాంగానికి ప్రభుత్వం ఉచితంగా రూ.240 కోట్లను వ్యయం చేసిందని డిస్కం తిరుపతి ఎస్‌ఈ ఎం.కృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన బి.కొత్తకోటలో వ్యవసాయ కనెక్షన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటును పరిశీలించారు. సాగుబోర్లకు మంజూరైన కనెక్షన్లు, వాటికి సంబంధించి నమోదు చేసిన రికార్డులతో పొలాల్లోకి వెళ్లి తనిఖీలు నిర్వహించారు. ప్రభుత్వం వ్యవసాయానికి ఉచితంగా విద్యుత్, కనెక్షన్లు ఇస్తోందని చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 18 వేల వరకు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు దరఖాస్తులు అందగా, 16,500 కనెక్షన్లు ఇవ్వగా 1,340 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్టు చెప్పారు. ఒక్కో కనెక్షన్‌కు సర్వీసు, సామర్థ్యం బట్టి ట్రాన్స్‌ఫార్మర్, మూడు స్తంభాలను ఏర్పాటు చేశామని చెప్పారు. దీనికోసం ప్రభుత్వం 12 వేల ట్రాన్స్‌ఫార్మర్లను మంజూరు చేసిందని చెప్పారు. వీటన్నింటిని ప్రభుత్వం ఉచితంగా అందిస్తోందని చెప్పారు. రైతులు ఒక్కో హార్స్‌పవర్‌కు రూ.1,100 డిపాజిట్ మాత్రమే చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. రైతులకు ఇచ్చే ట్రాన్స్‌ఫార్మర్, కనెక్షన్ ఇచ్చే మెటీరియల్ కలుపుకొని రూ.2 లక్షల వ్యయం అవుతుందని చెప్పారు. ఈ మొత్తం ప్రభుత్వమే భరించి రైతులపై రూ.240 కోట్ల భారం పడకుండా చేసిందన్నారు. సాగుకు తొమ్మిది గంటలు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందిస్తున్నట్టు చెప్పారు. ఆయన వెంట మదనపల్లె ఈఈ రాజశేఖర్ రెడ్డి, ఏఈ గిరిధర్, సిబ్బంది ఉన్నారు.

సూర్యప్రభ వాహనంపై లక్ష్మీనరసింహుడు



సూర్యప్రభ వాహనంపై స్వామి వారి ఊరేగింపు

పెండ్లిమర్రి : మండలంలోని వెయ్యినూతల కోన క్షేత్రంలో శ్రీలక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం ఉదయం స్వామి వారికి సూర్యప్రభ వాహన సేవ నిర్వహించారు. సాయంత్రం ఊంజల్ సేవ, సహస్ర దీపాలంకరణ సేవ, శ్రీచక్ర పెరుమాళ్ సేవ, రాత్రి గరుడ సేవ వంటి కార్యక్రమాలను వేద పండితులు నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వేల సంఖ్యలో భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ఆవరణలో పలువురు దాతలు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

నేడు కల్యాణం, చక్రస్నానం

బ్రహ్మోత్సవాలలో భాగంగా చివరి రోజు శనివారం లక్ష్మీనరసింహస్వామి, లక్ష్మీదేవి అమ్మవారికి ఉదయం 9 గంటలకు వైభవంగా కల్యాణం, మధ్యాహ్నం చక్రస్నానం, గజవాహన సేవ, సాయంత్రం ధ్వజ అవరోహణం కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త పి.నరసింహ హరిప్రసాద్ తెలిపారు. కల్యాణానికి భక్తులు తరలివచ్చి కనులారా తిలకించాలని ఆయన కోరారు.

రైలు కింద పడి మహిళ మృతి

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగరంలోని రైల్వేస్టేషన్ వద్ద గల రైల్వే యార్డు ఎగువ భాగాన గూడ్స్ రైలు కిందపడి ఓ మహిళ మృతి చెందినట్లు రైల్వే ఎస్‌ఐ రారాజు తెలిపారు. సుమారు 50 ఏళ్ల వయసు గల ఈ మహిళ ఆచూకీ తెలియరాలేదని, మృతదేహాన్ని కడప రిమ్స్ మార్చురీకి తరలించామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.